క్లుప్తంగా

నంద్యాల ఎంపీడీఓగా సుగుణ



ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన సుగుణశ్రీ

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల ఎంపీడీఓగా సుగుణశ్రీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా కడప జిల్లాకు బదిలీ అయిన సుగుణశ్రీని తిరిగి నంద్యాల మండలానికి నియమించారు. ఈ నేపథ్యంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆమెను కార్యాలయ సిబ్బంది కలిసి అభినందించారు.

చిరుత కలకలం

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామ పొలిమేరలో చిరుత సంచారం కలకలం రేపింది. చిరుత సంచరిస్తోందనే సమాచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పొలాల్లో చిరుత సంచరిస్తుందని అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం సాయంత్రం అధికారులు పులి అడుగుజాడల కోసం గాలించారు. ముందు రోజు వర్షం పడడంతో పులి అడుగుజాడలు చెరిగిపోయాయి. దీంతో అధికారులు ఎటు నిర్ధారించుకోలేకపోయారు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిరుత సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



సీఐ మల్లికార్జునగుప్త

బొమ్మలసత్రం: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త పేర్కొన్నారు. ఆదివారం ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపేటప్పుడూ హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. నెంబర్ ప్లేట్‌లేని వాహనాలు పట్టుబడితే సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

శిరివెళ్ల ఎస్ఐగా చిన్న పీరయ్య

శిరివెళ్ల : మండల నూతన ఎస్ఐగా పీరయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్ఐగా పని చేసిన సురేష్ బదిలీ కావడంతో ఈయన వచ్చారు. కర్నూలు జిల్లా పెద్ద పెద్ద తుమ్మలం స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన పీరయ్యను స్టేషన్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజల మన్ననలు పొందాలి



ఎంపీడీఓలతో ఎంపీపీ వీరభద్రుడు, కార్యాలయ సిబ్బంది

చాగలమర్రి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ విధులను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. బదిలీపై వెళ్తున్న మండల ఎంపీడీఓ ఎస్ సూర్యనారాయణరెడ్డికి, ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన మహబూబ్‌దౌలకు ఆదివారం కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ తాహీర్‌హుసేన్, ఏపీఓ నిర్మ లా దేవి, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీరెడ్డి, సర్పంచ్‌లు బాలీశ్వరరెడ్డి, గోవిందయ్య, ఉపాధిహామీ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌అజీజ్, నాయకులు జమీల్లావుద్దీన్, ఫ్లజుర్ రెహమాన్, ఇబ్రహీం కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉర్దూ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు.

విధి నిర్వహణలో రాజీ పడొద్దు



ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

ఆళ్లగడ్డ: శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడొద్దని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. నియోజకవర్గంలోని శిరివెళ్ల, ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్లను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, వివిధ కేసుల్లో సీజ్ అయిన వాహనాలను పరిశీలించారు. అసాంఘిక కార్యకలపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ చిరంజీవి, ఎస్ఐ నగీన ఉన్నారు

కాలం మారుతోంది. ఆరోగ్య పరిరక్షణ, దేహదారుఢ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. దీంతో పలువురు జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల బాటపడుతున్నారు. కొందరు ఊబకాయాన్ని తగ్గించుకునేందుకు ఫిట్‌నెస్ ట్రైనర్ల సూచనలు పాటిస్తూ చెమటలు చిందిస్తుంటే సిక్స్‌ప్యాక్, ఫర్‌ఫెక్ట్ బాడీ కోసం కుర్రకారు గంటల తరబడి ఎక్సర్‌సైజ్ చేస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు నగరాలకు మాత్రమే పరిమితమైన జిమ్‌సెంటర్లు నేడు చిన్న చిన్న పట్టణాలకు సైతం విస్తరిస్తున్నాయి.



నంద్యాల పట్టణంలోని ఓ జిమ్‌సెంటర్‌లో కసరత్తు చేస్తున్న యువత

జిమ్‌దాబాద్!

ఆరోగ్య పరిరక్షణ, దేహదారుఢ్యంపై పెరుగుతున్న మక్కువ

- సిక్స్‌ప్యాక్, ఫర్‌ఫెక్ట్ బాడీ కోసం కసరత్తులు చేస్తున్న యువత
- పెరిగిన ఆసక్తితో చిన్న చిన్న పట్టణాలకు సైతం విస్తరిస్తున్న జిమ్‌సెంటర్లు
- మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు
- ఆహార నియమాలు పాటించాలంటున్న నిపుణులు

నంద్యాల (న్యూటౌన్): ఒకప్పుడు జిమ్‌కు వెళ్లే వారి సంఖ్య చాలా తక్కువగా ఉండేది. అయితే కొన్ని సంవత్సరాలుగా పరిస్థితి మారింది. అధిక బరువును తగ్గించుకోవడం.. ఫిట్‌గా ఉండేందుకు అనేకమంది ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. రోజులో ఒకటి నుంచి రెండు గంటల పాటు జిమ్‌లో వ్యాయామం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో మహిళలు కూడా ఉండటం విశేషం.

జిల్లాలో ఇలా..

నంద్యాల పట్టణ పరిధిలోనే 30కు పైగా జిమ్ సెంటర్లున్నాయి. ఇక ఆత్మకూరు, డోన్, బేతంచెర్ల, బనగానపల్లె, కోవెలకుంట్ల తదితర పట్టణాల్లో కూడా సెంటర్లున్నాయి. గతంలో నగరాలకు మాత్రమే పరిమిత మైన జిమ్ సెంటర్లు ఇప్పుడు మండల కేంద్రాల్లోనూ ఏర్పాటవుతున్నాయి. తెల్లవారుజామున 4 గంటలకే ఇవి ప్రారంభమవుతున్నాయి. ఉదయం 10 గంటల వరకు కొనసాగుతున్నాయి. మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు జిమ్ సెంటర్లు కిటకిటలాడతున్నాయి. ఉదయం వేళల్లో బిజీగా ఉండేవారు సాయంత్రం వేళ వ్యాయామం చేసేందుకు సమయం కేటాయిస్తున్నారు.



శిక్షణ ఇస్తున్న కోచ్

ఆహార నియమాలు పాటించాలి

జిమ్ముకు వెళుతున్నాం.. అయినా బరువు తగ్గడం లేదు.. ఎంత చేసినా అలానే ఉన్నానని కొందరు అంటుంటారు. అయితే, ఎంత కష్టపడినా ఆహారం తీసుకునే విషయంలో నియమాలు పాటించకపోతే ఉపయోగం ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ప్రస్తుత రోజుల్లో జంక్‌ఫుడ్ తీసుకునే వారు పెరిగిపోతున్నారు. దీంతో శరీర బరువు పెరుగుతోంది. ఈ ఆహార పదార్థాలతో పాటు మద్యానికి దూరంగా ఉంటేనే అనుకున్న శరీర సౌష్టవాన్ని సాధించగలరు. అలాగే ప్రోటీన్ శాతం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవకాశం ఉంటుంది.

కోచ్ సూచనలు ముఖ్యం

జిమ్‌లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కండరాలు దెబ్బతినే అవకాశం ఉంది. కోచ్ సూచనల మేరకు నడుచుకుంటే ఆరోగ్యంతోపాటు శారీరక సౌష్టవం కూడా లభిస్తుంది. అయితే కొందరు యువత అత్యుత్సాహంతో కోచ్ పనిలేకుండా వారికి ఇష్టం వచ్చినట్లు వ్యాయామాలు చేస్తుంటారు. దీంతో భవిష్యత్లో కండరాలు, నడుము నొప్పులు వచ్చే అవకాశాలున్నాయి.

ఫిట్‌నెస్ పరికరాలకు ఫుల్ డిమాండ్

ఫిట్‌నెస్‌పై అందరూ దృష్టిసారించారు. వ్యాయామ కేంద్రాలు విస్తరిస్తుండటంతో ఫిట్‌నెస్ పరికరాల వ్యాపారానికి డిమాండ్ పెరిగింది. జిమ్ సెంటర్‌కు వెళ్లలేని వారు ఇళ్లలోనే పరికరాలు ఏర్పాటు చేసుకుని కసరత్తులు చేస్తున్నారు.దీంతో కొందరు ఈ పరికరాల విక్రయానికి పట్టణంలో ప్రత్యేకంగా దుకాణాలనే నెలకొల్పుతున్నారు.

మేము సైతం అంటున్న మహిళలు

ఆరోగ్యం, అందమైన శరీరాకృతి కోసం మహిళలు పురుషులతో సమానంగా జిమ్ సెంటర్లను వినియోగించుకుంటున్నారు. వారి ఆసక్తి అనుగుణంగా జిల్లాలో మహిళల కోసం ప్రత్యేక జిమ్‌లు ఏర్పాటయ్యాయి. పేరుగాంచిన వ్యాయామ కేంద్రాల్లో మగువల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తూ మహిళా కోచ్‌ల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నారు. అబ్డామిన్ తదితర ఎక్సర్‌సైజులతో పొట్ట భాగాలను నియంత్రణలో పెట్టుకోవడానికి, అధిక బరువు, లావులను తగ్గించుకునేందుకు మహిళలు ఎక్కువగా జిమ్‌లకు వెళ్తున్నారు.

ఆసక్తి పెరుగుతోంది



యువత వ్యాయామం చేసేందుకు మక్కువ చూపిస్తున్నారు. వారికి ఏ విధంగా శరీర సౌష్టవం కావాలో తెలుసుకుని శిక్షణ ఇస్తుంటాను. కొందరు బరువు తగ్గడానికి, మరికొందరు సిక్స్ ప్యాక్ కావాలంటారు. మేము చెప్పిన విధంగా చేస్తూ.. ఆహార పద్ధతులు పాటిస్తే వారు అనుకున్నది సాధించగలరు. అదే విధంగా ఇటీవల మహిళలు కూడా ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. –ఖాజా, జిమ్ నిర్వాహకుడు

మంచి ఆరోగ్యం కోసం



ఆహార నియమాలు పాటించకుండా, వ్యాయామం చేయకుండా ఆరోగ్యంగా ఉండాలంటే కుదరదు. అనారోగ్య సమస్యలు వస్తాయి. అందుకే నేను ప్రతిరోజూ జిమ్ సెంటర్‌కు వెళ్తున్నాను. ఆరోగ్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మన చేతుల్లోనే ఉంది. –శిరీష, యువతి

ఫిట్‌గా ఉండేందుకు



నాకు ఫిట్‌గా ఉండటం అంటే ఇష్టం. ఇందుకోసం ఎన్ని పనులున్నా రోజులో ఒక గంట కచ్చితంగా నేను వ్యాయామం చేస్తాను. కొన్ని నెలలుగా జిమ్‌కు కూడా వెళ్తున్నాను. ఫర్‌ఫెక్ట్ బాడీ కోసం కోచ్ సూచనల ప్రకారం ట్రైనింగ్ తీసుకుంటున్నాను. –యూనిస్, స్టూడెంట్

అలరించిన దేశభక్తి నృత్యాలు



దేశభక్తి గీతం నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ఆదివారం కళారాధన నంద్యాల ఆధ్వర్యంలో దేశభక్తి బృంద నృత్యాలు, ఆధునిక నృత్య పోటీలు నిర్వహించారు. ప్రత్యేకమైన దుస్తులు, చక్కటి హావాభావాలతో వేగవంతమైన ఆధునిక సంగీతానికి అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్య విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో దేశ భక్తి బృంద నృత్య పోటీల్లో రోటరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రథమ బహుమతి సాధించింది. కార్యక్రమంలో కళారాధన ప్రధాన కార్యదర్శి రవికృష్ణ, శ్రీమన్నారాయణ, డీసీపీ శర్మ, శివరామిరెడ్డి, రంగనాథ్, మజీద్, మధు, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మినీ ట్రాన్స్‌ఫార్మర్లు



చాపిరేవుల పీహెచ్‌సీ ఆవరణలో తక్కువ ఎత్తులో ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్లు

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని చాపిరేవుల పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటైన మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఇవి తక్కువ ఎత్తులో ఉండటం వాటి చుట్టు ప్రహరీ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆసుపత్రి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్లను ఎత్తులో బిగించి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉద్యోగులకు పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరావు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.మధుసూదనరావు, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగరి శ్రీనివాసులు, మాధవస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ జూలై 2023 నుంచి కొత్త పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆలస్యమవుతున్న కారణంగా మధ్యంతర భృతి ఐఆర్ 30శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 117 జీవో నెంబరుతో ప్రాథమిక పాఠశాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ జీవో నెం.53 ప్రకారం నిర్వహించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లను రద్దు చేయాలని, ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అకాడమీ కమిటీ సభ్యులు సాంబశివుడు, మహబూబ్, బాషా, పుల్లయ్య, లింగమయ్య, రవి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, నాయక్, రమేష్, రామాంజనేయులు, మునిస్వామి, పవన్‌కుమార్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం చేసి ప్రాణదాతలు కండి



పోస్టర్లను విడుదల చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): అవయవదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో అవయవదానంపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవదానం చేయడం ద్వారా 8 మందికి జీవితాలను ప్రసాదించవచ్చని చెప్పారు. ఈనెల 13న అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా స్థానిక శాంతిరాం మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులకు, అలాగే చనిపోయిన తర్వాత వైద్య కళాశాలలకు శరీరం దానం చేయడానికి అంగీకరించిన వారికి సన్మానించనున్నట్లు తెలిపారు. అవయవ దానం చేసే వారు వారు 8977750583కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు ఉస్మాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 1214 మెమోను రద్దు చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నంద్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అజిత్, మహబూబ్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరు బస్టాండ్‌లో ఉన్న కార్మిక సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక పంపిణీని సరళతరం చేసి భవన నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికుడికి రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షలు వారి కుటుంబాలకు అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అబ్దుల్‌సమ్మద్, గులాబ్, ఖాజాహుసేన్, అప్సర్, రవి, చంటి, బాలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిపై భక్తజన సందడి



మల్లన్న దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రీశైల మల్లన్నను దర్శించుకుని ఆధ్యాత్మిక అనుభూతి, శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను కన్నులారా వీక్షించి పర్యాటక అనుభూతి పొందేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలను నిలుపుదల చేశారు. భక్తులందరికీ స్వామిఅమ్మవార్ల సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి. మల్లన్న దర్శనం అనంతరం భక్తులు శ్రీశైలం డ్యాం వద్దకు చేరుకుని డ్యాం అందాలను తనివితీరా ఆస్వాదించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళా వేదికపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎస్.రాధిక, బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాగణపతిం, శివతాండవం, అయిగిరినందిని, తాండవ నృత్యకరి, హరహర శంకరా, భో శంభో, నమశ్శివాయతే, కాలభైరవాష్టకం, భవాని అష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు శ్రీహిత, హర్షిత, హిరణ్మయి, సాత్విక, తేజస్విని, వైష్ణవి, శృతిక తదితరుల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

నేటి కార్యక్రమాలు

నీటి సరఫరాలో అంతరాయం

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస నగర్ పంప్ హౌస్ వద్ద జరుగుతున్న అమృత్ పథకం ఇంటర్ కనెక్షన్ పనుల నేపథ్యంలో నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. పట్టణంలోని ఎంఎస్ నగర్, వీసీ కాలనీ, విజయపురి కాలనీ, బర్మశాల, రాయల్ కాంపౌండ్, మున్సిపల్ ఆఫీసు ప్రాంతం ప్రజలు ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ఉయ్యాలవాడ : మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ మహేంధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు స్థానిక మోడల్‌స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయన్నారు.

గ్రామాల అభివృద్ధిపై అవగాహన సదస్సు

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో నేటి నుంచి మూడు రోజుల పాటు గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ ఆదివారం తెలిపారు. డీపీఓ మంజులవాణి, డీఎల్‌పీఓ రాంబాబులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యే ఈ సదస్సులో పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు తదితర గ్రామాభివృద్ధి పనులపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు.

క్రైం కార్నర్

దంపతులపై దాడి

కొలిమిగుండ్ల: స్థానిక మోడల్ స్కూల్ సమీపంలోని కాలనీలో ఉంటున్న దంపతులపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన చిన్న కాంతకు జయమ్మతో సుమారు పదిహేడేళ్ల క్రితం వివాహం జరిగింది. మనస్పర్థలు రావడంతో రెండేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. విడాకులు ఇవ్వాలని భార్యపై ఒత్తిడి చేస్తుండడంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే భార్య సోదరుడు కంబగిరిస్వామి ఇంటి వద్దకు వెళ్లిన చిన్నకాంతు అతనిపై దాడికి పాల్పడ్డాడు. కత్తితో దాడి చేసేందుకు యత్నించగా భార్య సరస్వతి అడ్డు రావడంతో ఆమె చేతికి గాయాలయ్యాయి. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు ఆదివారం గ్రామ శివారులోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.10,500 నగదు స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇంకెన్నాళ్లు ఇలా..

ముళ్ల కంప చెట్ల మధ్యలో ఎదుగు, బొదుగు లేకుండా ఉన్న ఈ పంచాయతీ భవనం నంద్యాల మండలం బ్రాహ్మణపల్లె గ్రామంలో ఉంది. 6 ఏళ్ల క్రితం నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో నిలిచి పోయిన ఈ భవనాన్ని ముళ్ల కంపలు కప్పేశాయి. పంచాయతీ భవనం ఏర్పాటవుతుందని కలలు కన్న గ్రామస్తుల ఆశలు నెరవేరడం లేదు. స్లాబ్ లెవెల్‌లో నిలిచి పోయిన ఈ భవనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో గోడలు కూలేందుకు సిద్ధమయ్యాయి. – నంద్యాల(అర్బన్)



రూఫ్ లెవెల్‌లో నిలిచి పోయిన పంచాయతీ భవనం

ఆధ్యాత్మికం

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఎలాంటి ఇబ్బందులు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

15న వీరభద్రస్వామి కల్యాణం

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని పోలూరు గ్రామంలో వెలసిన శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శేఖర్ ఆదివారం తెలిపారు. 14వ తేదీ గోపూజ, గణపతి పూజ, పుణ్యాఃవాచనం, కంకణ ధారణ, రుద్రహోమాలు, కుంకుమార్చనలు ఉంటాయన్నారు. 15న స్వామి వారి లీలా కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1గంట నుంచి మహాప్రసాద (భోజన) వితరణ ఉంటుందన్నారు. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

మహానందికి పోటెత్తిన భక్తులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణాల్లోని గరుడనంది, వినాయకనంది, రాతినంది, పెద్దనంది ప్రాంతాలను సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో రాహుకేతు పూజలు

శ్రావణమాసం, భాను సప్తమి సందర్భంగా మహానందిలో ఆదివారం రాహుకేతు పూజలు నిర్వహించారు. ఈ మేరకు భక్తులు స్థానిక రాహుకేతు మండపంలో స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో రాహుకేతువులకు ప్రత్యేక పూజలు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బసేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని మొదటి రోజు గణపతి పూజతో ప్రారంభించి చివరి రోజు బుధవారం విగ్రహ ప్రతిష్ఠ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా స్వాతి వేడుకలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవా నిర్వహించి అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అదే విధంగా లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మహానైవేద్యం సమర్పించి స్వామి, అమ్మవార్లకు మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధుసూదనరాయల్, అర్చకులు రామ్మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

అట్టహాసంగా క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధ్యక్షుడు అమీర్‌బాషా

చాగలమర్రి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చాగలమర్రి మండల స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాయల్ కేఫ్ సమీపంలోని క్రీడా మైదానంలో ఫోర్‌లైన్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సంఘం అధ్యక్షుడు అమీర్‌బాష, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ ప్రారంభించి మాట్లాడారు.మండలంలోని స్వర్ణకారులను క్రీడలతో ఉత్సాహపరిచేందుకు ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఫోర్ లైన్ క్రికెట్‌తో పాటు చెస్, క్యారమ్స్, డబుల్ షటిల్, బ్యాడ్మిటన్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు స్థానిక ఫిజికల్ డైరెక్టర్ దాదాపీర్ న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారన్నారు. గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15వ తేదీన స్థానిక చక్రం కాంప్లెక్స్‌లోని స్వర్ణకారుల సంఘం కార్యాలయంలో బహుమతులు, మోమోంటోలు అంద జేస్తామన్నారు. అలాగే సూక్ష్మ స్వర్ణ చిత్రం తయారు చేసిన స్వర్ణకారునికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్వర్ణకారులు ఎస్ఎంఎం బాషా, పప్పీ గౌస్, సాధిక్ వలి, మాలిక్‌బాషా, గౌస్‌బాషా, వాజీద్, మన్సూర్, కరీం, హరీష్, తదితరులు పాల్గొన్నారు.